సాక్షి
తిరుపతి
శుక్రవారం । 3 । మార్చి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,800

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	18
చిత్తూరు	34	17
తిరుమల	31	14
గూడూరు	34	20
నగరి	36	18



గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక, కలశ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

పాడిరైతులకు చేయూత



రవికుమార్, పశుసంవర్ధకశాఖ

తిరుపతి అర్బన్: పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత ద్వారా ప్రభుత్వం పేద మహిళలకు అందిస్తున్న రూ.18,750తో పాడి పశువులను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. సంకరజాతికి చెందిన ముర్ర గేదెలను కొనుగోలు చేయడానికి డీఆర్‌డీఏలోని సెర్ప్ విభాగం నుంచి సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 9 వేల మంది దరఖాస్తు చేసుకోగా అందులో 4,627 మందికి పాడి పశువులను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. సంపూర్ణ మిశ్ర పేరుతో పశువులకు రూ.18 విలువ చేసే దాణాను రూ.6.5 కు ఇస్తున్నట్లు చెప్పారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

సూళ్లూరుపేట: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13 నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రెస్పెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రముని, తహసీల్దార్ కే రవికుమార్, కమిషనర్ ఎన్ నరేంద్రకుమార్‌కు పలు సూచనలు అందించారు.

రైతులే వ్యాపారులు



కలెక్షన్ సెంటర్

తిరుపతి అర్బన్: పండించిన పంట గిట్టుబాటు ధర వచ్చేవరకు నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజీలను 75శాతం సబ్సిడీతో రైతు సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఒక్కో సంఘంలో వంద మంది రైతులు ఉండడానికి వీలుగా చర్యలు చేపడుతోంది. సంఘం తరుపున దరఖాస్తు చేసుకున్న రైతులకు కలెక్షన్ సెంటర్లకు రూ.15 లక్షలు చొప్పున, కోల్డ్ స్టోరేజీలకు రూ.12 లక్షల వరకు మంజూరు చేస్తారు. ఇందులో 75శాతం రాయితీ ఉంటుంది. జిల్లాకు 50 కలెక్షన్ సెంటర్లు కేటాయించగా.. దరఖాస్తు చేసుకున్న రైతు సంఘాలకు ఇప్పటికే 34 మంజూరు చేశారు. మరోవైపు కోల్డ్‌స్టోరేజీలు 13 మంజూరయ్యాయి. వీటికి రైతులు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

తెప్పోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఐదు రోజుల పాటు తెప్పపై విహరించనున్న మలయప్ప

తిరుమల: ప్రతి ఏటా ఫాల్గుణ మాసం ఏకాదశి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి తెప్పోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు తెప్పలను పుష్కరిణిలో ప్రయోగాత్మకంగా ఇప్పటికే పరిశీలించారు. తెప్పోత్సవాలను పురస్కరించుకున్ని శ్రీవా రి పుష్కరిణిని కూడా సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెప్పోత్సవాల నేపథ్యంలో ఐదు రో జుల పాటు పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

తెప్పోత్సవాలు ఇలా..

- మొదటి రోజు స్వామి వారు త్రేతాయుగానికి ప్రతీకగా శ్రీరాముని అవతారంలో మాడ వీధుల్లో ఊరేగనున్నాయి. అనంతరం పుష్కరిణికి చేరుకుని తెప్పలపై విహరించనున్నారు.
- రెండో రోజు ద్వాపరయుగానికి ప్రతీకగా శ్రీకృష్ణుని అవతారంలో తెప్పలపై విహరిస్తారు.
- మూడవ రోజు కలియుగానికి ప్రతీకగా భూదేవి, శ్రీదేవి సమేతుడై శ్రీవారు తెప్పలపై విహరిస్తారు.
- నాలుగో రోజు మలయప్పస్వామి తెప్పలపై ఐదు ప్రదక్షిణలు చేసి భక్తులను కనువిందు చేయనున్నారు.
- చివరిగా ఐదోరోజు స్వామి వారు పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేయనున్నారు.





వెలుగుల కొండ : దేదీప్యమానంగా శ్రీవారి పుష్కరిణి

ఏర్పాట్లు పూర్తి

శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది.

పలు సేవలు రద్దు

తెప్పోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి జరిగే నిత్య సేవ అయిన సహస్రదీపాలంకరణ సేవలను ఐదు రోజుల పాటు టీటీడీ రద్దు చేసింది. మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవాలను రద్దు చేసింది. ఇక పౌర్ణమి రోజున జరిగే శ్రీవారి గరుడసేవను రద్దు చేసింది. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించింది.

వేటాడుతూ.. జల్లెడ పడుతూ!

ఎర్రచందనం దొంగలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. కట్టుదిట్టంగా నిఘా పెట్టి కదలికలను పసిగడుతోంది. పకడ్బందీగా కూంబింగ్ నిర్వహిస్తూ ఎక్కడికక్కడ అడ్డుకుంటోంది. ఏళ్ల తరబడి తప్పించుకుతిరుతున్న మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్లను పక్కా ప్లానింగ్‌తో వేటాడుతోంది. వెతికి వెతికి కనిపెట్టి మరీ అదుపులోకి తీసుకుంటోంది. వీరి నుంచి రాబట్టిన సమాచారంతో అంతర్జాతీయ స్మగ్లర్లకు చెక్ పెట్టేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తోంది.



మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ శివ



మోస్ట్ వాంటెడ్ బ్రదర్స్ బాషా, జాకీర్‌ని అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి (ఫైల్)

- ఎర్రదొంగలపై ఉక్కుపాదం
- వరుసగా మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ల అరెస్ట్
- ఒక్కొక్కరిపై 45 నుంచి 90 కేసులు
- పకడ్బందీగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల కూంబింగ్

సాక్షి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిలో విస్తరించిన శేషాచలం అభయారణ్యంలో లభ్యమయ్యే అరుదైన ఎర్రచందనానికి ప్రపంచ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో గ్రామస్థాయి నుంచి దేశ విదేశాల దాకా పలువురు స్మగ్లర్లుగా అవతారం ఎత్తుతున్నారు. గుంపులు గుంపులుగా అడవిలోకి చొరబడి ఎర్రచందనం చెట్లను నరికేస్తున్నారు. స్మగ్లర్ల అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్, పోలీసులు, అటవీశాఖ అధికారులు నిరంతరం నిఘా పెడుతున్నారు. మోస్ట్‌వాంటెడ్ స్మగ్లర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వెంటాడి వేటాడి ఒక్కొక్కరినీ అరెస్టు చేస్తున్నారు. అందులో భాగంగా ఏళ్ల తరబడి తప్పించుకు తిరుగుతున్నా బడా స్మగ్లర్ మురుగన్ (40)ను గత నెల 2వ తేదీన అరెస్ట్ చేశారు. తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన మురుగన్‌పై శ్రీకాళహస్తి- రేణిగుంట మార్గం మీదుగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే అతడి ప్రధాన అనుచరుడు రేణిగుంటకు చెందిన మేఘవర్ణం కూడా పట్టుబడ్డాడు. మురుగన్‌పై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 42 కేసులు నమోదయ్యాయి. వీరి ద్వారా అంతర్జాతీయ స్మగ్లర్ల సమాచారం రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

దొంగలకు దొంగలు!

వైఎస్సార్ కడప జిల్లా చాపాడు మండలానికి చెందిన అన్నదమ్ములు షేక్ చెంపతిలాల్‌బాషా(36), షేక్ చెంపతిలాల్ జాకీర్(27) ఎర్రచందన స్మగ్లింగ్‌లో ఆరితేరారు. వీరిపై వివిధ జిల్లాల్లో 89 కేసులు ఉన్నాయి. కూలీలుగా చేరిన ఈ అన్నదమ్ములు స్మగ్లర్లతో పరిచయం పెంచుకుని, ముందు లారీలకు దుంగను లోడ్ చేసేవారు. తర్వాత సులువుగా ఎర్రచందనం కొట్టేసి సొమ్ము చేసుకోవడంపై దృష్టి పెట్టారు. అడవి నుంచి స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న లారీలను పోలీసుల వేషధారణతో అడ్డుకుని హైజాక్ చేస్తుంటారు. అనంతరం సరుకును బడా స్మగ్లర్లకు విక్రయించి రూ.కోట్లు పోగేసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ బ్యాచ్‌ను సిద్ధం చేసుకుని దొంగలకే దొంగలుగా తయారయ్యారు. ఈ ముఠాను గత నెల 5వ తేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా ప్లాన్‌తో అరెస్ట్ చేశారు.



పట్టుబడ్డ స్మగ్లర్ల వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ (ఫైల్)

సమాచారం

నెల	పట్టుబడిన స్మగ్లర్లు
సెప్టెంబర్	91
అక్టోబర్	68
నవంబర్	70
డిసెంబర్	101
జనవరి	72
ఫిబ్రవరి	73
మొత్తం	475

నిఘా పెట్టి .. ఆట కట్టు

శేషాచల అటవీ సరిహద్దుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కట్టుదిట్టంగా నిఘా పెట్టారు. ఎర్రచందనం స్మగ్లర్ల ఒక్కొక్కరి ఆటకట్టిస్తున్నారు. ఏళ్ల తరబడి ఫారెస్ట్ అధికారులను ముప్పుతిప్పలు పెట్టిన మోస్ట్ వాంటెడ్ ఎర్రస్మగ్లర్ శివ(42)ను గత నెల 25వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ఇతడిపై పలు స్టేషన్లలో 42 కేసులు ఉన్నాయి. శివకు అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలానికి చెందిన శివశంకర్ అలియాస్ శివ సుమారు 60 కేసుల్లో వాంటెడ్ క్రిమినల్. ఎర్రచందనం కేసుల్లో రెండు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. చిత్తూరు పోలీసులు శ్రీరంగరాజపురం వద్ద రెండు రోజుల క్రితం శివశంకర్‌ను అరెస్టు చేశారు. మోస్ట్ వాంటెడ్‌గా భావిస్తున్న స్మగ్లర్లపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు నిఘా పెట్టి ఒక్కొక్కరిని అరెస్టు చేస్తుండటంతో ఎర్రదొంగలు శేషాచలంలోకి ప్రవేశించేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం.

ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ పరిశీలన



గదుల కేటాయింపు కౌంటర్లను తనిఖీ చేస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: మార్చి 1 నుంచి తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని గదులు కేటాయించే కేంద్రాలు, ఉప విచారణా కార్యాలయాలను ఈఓ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో దళారీ వ్యవస్థను పూర్తిగా తగ్గించేందుకు, టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు సామాన్య భక్తులకు చేరేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. తిరుమలలో సర్వదర్శనం, లడ్డూప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు అంశాల్లో ఈ పరిజ్ఞానం ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్టు వెల్లడించారు. తద్వారా గదులను రొటేషన్ చేసే పద్ధతిని పూర్తి స్థాయిలో అరికట్టవచ్చన్నారు. రెండవ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి టోకెన్లు లేకుండా సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానంతో రూ.50 ఉచిత లడ్డూ టోకెన్లు ఇవ్వడం జరుగుతోందని, ఈ పరిజ్ఞానం ద్వారా లడ్డూ ప్రసాదాలలో దళారీ వ్యవస్థను కట్టడి చేయవచ్చని చెప్పారు. అంతకుముందు ఈఓ ఏఆర్పీ, సీఆర్ఓ, ఎంబీసీ 34 గదుల కేటాయింపు కేంద్రాలు, ఏఎంసీ, ఎస్ఎంసీ, టీబీసీ ఉపవిచారణ కార్యాలయాలను పరిశీలించారు. ఈఓ వెంట డెప్యూటీ ఈఓలు హరీంద్రనాథ్, భాస్కర్, ఏఈఓ వెంకటేశ్వర్లునాయుడు, ఓఎస్డీ రామకృష్ణ ఉన్నారు.

ఔషధాల ఉత్పత్తి సామర్థ్యం పెంపు



అధికారులతో సమీక్షిస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి అలిపిరి: టీటీడీ ఆధ్వర్యంలోని నరసింగాపురంలో గల ఆయుర్వేద ఫార్మశీలో ఔషధాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్న ట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో గురువారం ఆయుర్వేద ఫార్మశీపై సమీక్ష నిర్వహించారు. జేఈఓ మాట్లాడుతూ ఫార్మశీని బలోపేతం చేసేందుకు మూడు ఇండస్ట్రియల్ షెడ్లు నిర్మించామని, త్వరలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూ.3.50 కోట్లతో ఔషధాల తయారీ యంత్రాల కొనుగోలుకు అనుమతివ్వగా అందులో ఇప్పటివరకు 75 శాతం పూర్తయ్యిందని వెల్లడించారు. మొత్తం 314 రకాల ఫార్ములాలకు ఆయుష్ శాఖ నుంచి అనుమతి లభించిందని, వీటిలో 60 రకాల మందులు మొదటి దశలో ఉత్పత్తి చేసి రోగులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. డీఎఫ్ఓ ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన బ్రాహ్మణపట్టు, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, కల్యాణి డ్యామ్, నరసింగాపురం, ఇతర టీటీడీ నర్సరీల్లో ఔషధ మొక్కలు పెంచాలన్నారు.

బాబు, లోకేష్ కళ్లులేని కబోదులు

- జీడీ నెల్లూరు నియోజకవర్గంలో రూ.200 కోట్లతో రోడ్ల నిర్మాణం
- నియోజకవర్గ వ్యాప్తంగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సుడిగాలి పర్యటన

సాక్షి, తిరుపతి: కళ్లముందు అభివృద్ధి కనిపిస్తున్నా కనిపించనట్టు నటిస్తూ పచ్చి అపద్ధాలు చెబుతూ పిచ్చిపట్టి తిరుగుతున్న వ్యక్తి, కళ్లలేని కబోది లోకేష్ అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేష్ గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో గుంతల తప్ప రోడ్లు కనిపించలేదని ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ నిధులతో పూర్తిచేసిన రహదారులను ఆయన గురువారం పత్రిక, మీడియా ప్రతినిధులకు చూపించారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లు, తారు రోడ్లను చూపించారు. అనంతరం చిత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్ అబద్ధాల పుట్ట అని ధ్వజమెత్తారు. ఏళ్ల తరబడి అటవీ అనుమతులు లేక ఆగిపోయిన రహదారులను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పించి రోడ్లును అభివృద్ధి చేయించారన్నారు. అదే రోడ్లపై పాదయాత్ర చేసిన లోకేష్ సైకోలాగే ప్రవర్తిస్తున్నాడని, రోడ్లను చూసి కళ్లలేని వ్యక్తిగా మాట్లాడడమే ఇందుకు నిదర్శనమన్నారు. లోకేష్ పాదయాత్రతో టీడీపీకి పడే ఓట్లు కూడా పడకుండాపోతాయన్నారు. దళితులను హింసించే కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు మొదలు పెట్టారని మండిపడ్డారు. 2014 ఎన్నికల సమయంలో బాబు డ్వాక్రా, రైతు రుణమాఫీలు, నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగం ఇలా పలు హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల తరువాత ఇచ్చిన మాటలను నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. పదవులను కట్టబెట్టడంలో సామాజిక న్యాయాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సమన్యాయాన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు, పచ్చమీడియా తప్పుడు కూతలు, రాతలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జరగబోయే ఎన్నికల్లో పెత్తందారులు (టీడీపీ అండ్‌కో), పేదవాడు(జగన్) మధ్య యుద్ధం జరగబోతుందని.. ఈపోరులో పేదవాడే గెలుస్తాడని ఆయన జోస్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బండి హేమసుందర్ రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, పద్మనాభరెడ్డి, ధనుంజయరెడ్డి, నారాయణరెడ్డి, కమలాకర్‌రెడ్డి, బాలాజీ నాయుడు, శివప్రకాష్‌రాజు, యశోదమ్మ, ప్రసాద్ రెడ్డి, రామయ్య, అమ్ములు పాల్గొన్నారు.



ఎగువ కమ్మకండ్రిగ వయా పుల్లూరుకు నూతనంగా నిర్మించిన రోడ్డు వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణ స్వామి

ఉగాదికి గృహప్రవేశాలు

తిరుపతి అర్బన్: వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఉగాదికి లక్ష్యాల మేరకు గృహ ప్రవేశాలు చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టాలు పొందిన ప్రతిఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. మార్చి 10 నాటికి 100శాతం ఇంటి నిర్మాణాలు ప్రారంభమవ్వాలన్నారు. రెండో దశ భూముల రీసర్వే ఏప్రిల్ చివరినాటికి పూర్తి చేయాలన్నారు. మార్చి 4వ తేదీ నాటికి వంద శాతం ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని సంబంధిత వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.

కేజీబీవీలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ

కేవీబీపురం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం డెప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాత్రిళ్లు విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల వ్యక్తిగత సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని పేర్కొన్నారు. డాక్టర్ సురేష్‌బాబు, ఆరోగ్యశాఖ సిబ్బంది కామరాజు పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌ఓ

వైఎస్సార్‌సీపీలోకి అరవింద్‌రెడ్డి



అరవింద్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ముచ్చివోలు అరవింద్‌రెడ్డి గురువారం వైఎస్‌ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, ప్రకాష్‌యాదవ్, రత్నంరెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో ట్రైనీ ఎఫ్‌ఆర్‌ఓలు



విహంగాలను వీక్షిస్తున్న ట్రైనీ ఎఫ్‌ఆర్‌ఓలు

దొరవారిసత్రం: ఉత్తరఖాండ్ ప్రాంతంలో శిక్షణ తీసుకుంటున్న 50 మంది ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్స్ (ఎఫ్‌ఆర్‌ఓ) బుధవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని విడిది చేసే వలస విహంగాలను వీక్షించారు. పక్షుల కేంద్రం ప్రాముఖ్యత, వలస విధానం, పక్షుల సంతాన అభివృద్ధి, చేపల వేట వంటి వాటి గురించి కూడా ట్రైనీ ఎఫ్‌ఆర్‌ఓలకు తిరుపతి డీఎఫ్‌ఓ శివ కుమార్ తెలియజేశారు. అనంతరం పర్యావరణ కేంద్రంలో విహంగ జీవన శైలి చిత్రాలు తిలకించారు. వీరి వెంట పక్షుల కేంద్రం ఎఫ్‌ఆర్‌ఏ వరప్రసాద్, ఎఫ్ఎస్‌ఓ బాలయ్య, నేచురల్ గైడ్ హుస్సేనయ్య ఉన్నారు.

విద్యాదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం




విరాళపు చెక్కును జేఈఓకు అందజేస్తున్న దాత

తిరుపతి అలిపిరి: శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.10,01,016 గురువారం విరాళంగా అందింది. తిరుపతికి చెందిన కె.శ్రీనివాస్ జగదీష్ చంద్ర ఈ మేరకు విరాళాన్ని తిరుపతిలోని శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో జేఈఓ సదాభార్గవికి అందజేశారు. దేవస్థానం విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

- వినియోగదారుల కోసం ఐవీఆర్‌ఎస్, రోబో కాల్ టెక్నాలజీ
- అందుబాటులో 1912 - 1800 425 155333 టోల్ ఫ్రీ నంబర్లు
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు వెల్లడి



సంతోష్‌కుమార్, సీఎండీ

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సీఎండీ సంతోషరావు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కాల్ సెంటర్లో అధునాతన సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఐవీఆర్‌ఎస్ సేవలు గురువారం నుంచి వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం కాల్ సెంటర్లో ఐవీఆర్‌ఎస్, రోబో టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. కాల్ సెంటర్లో అధునాతన సాంకేతికతతో కూడిన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ) శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలోని అధికారులు, సిబ్బంది బృందాన్ని సీఎండీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు 1912 లేదా 1800 425 15533 టోల్-ఫ్రీ నంబర్లను సంప్రదించొచ్చని చెప్పారు. ప్రస్తుతం వినియోగదారులు కాల్ సెంటర్ ప్రతినిధిలో మాట్లాడాల్సిన అవసరం లేకుండానే సమస్యను ఐవీఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా రిజిస్టర్ చేసి, ఆ సమస్యను సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లనున్నట్టు వెల్లడించారు. సంస్థ పరిధిలో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుగా అన్ని ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, సబ్-స్టేషన్లు, సిబ్బంది ద్వారా విద్యుత్ సమస్యల నమోదు ప్రక్రియను 1912కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. కాగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా వినియోగదారులు నేరుగా విద్యుత్ సమస్యల నమోదు ప్రక్రియను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డైరెక్టర్ సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, జనరల్ మేనేర్లు పద్మ, శారద, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దామోదర్ పాల్గొన్నారు.

దేశానికే ఏపీ తలమానికం

- పరిశ్రమలతో లక్షలాదిమందికి ఉపాధి
- బాబు, పవన్‌కు సీఎం జగన్ సవాల్‌ను స్వీకరించే దమ్ముందా?
- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి

తిరుపతి మంగళం : ఆంధ్రప్రదేశ్ దేశానికే తలమానికంగా నిలుస్తోందని, టీడీపీ పాలనలో కన్నా వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి స్పష్టంచేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పరిశ్రమల స్థాపనపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసే సవాల్‌ను స్వీకరించే దమ్ముందా.. 175 స్థానాల్లో పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీచేయగలుగుతారా అని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతే ముఖ్యమని ఆ విధంగా చేయగలిగితేనే రాజకీయాల్లో మనగలుగుతారని సీఎం జగన్ చాటిచెప్పారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు, రాజకీయాల్లో ప్రశ్నిస్తానంటూ వచ్చిన పవన్‌కల్యాణ్ ఈ సవాల్‌ను ఎందుకు స్వీకరించడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

దేశానికే తలమానికం

ఈనెల 3, 4 తేదీల్లో విశాఖ కేంద్రంగా నిర్వహించబోతున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు ద్వారా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని, ఇది దేశానికే తలమానికంగా నిలవబోతోందని గౌతమ్ రెడ్డి వెల్లడించారు. కేవలం పెట్టుబడులు రాబట్టడమే కాకుండా వచ్చిన పెట్టుబడులను 44 నెలల్లో కార్యరూపంలోకి తీసుకువచ్చేలా సీఎం కార్యాచరణతో ముందుకు సాగుతున్నారన్నారు.

బాబు బకాయిలు పెడితే ఆదుకున్న జగన్

చంద్రబాబు హయాంలో రూ.3600 కోట్ల బకాయిలు పెట్టి పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెడితే జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆర్థికంగాను, పవర్ టారిఫ్ కింద రూ.3000 కోట్లను చెల్లించి ఆదుకున్నారని గుర్తుచేశారు. ముఖేశ్ అంబానీ, కుమార మంగళం బీరా, జీఎంఆర్ సంస్థ అధినేత, టాటా గ్రూప్, అదానీ గ్రూపుల నుంచి పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలు ఏపీకి రాబోతున్నారన్నారు.

ముగిసిన జాతీయ సైన్స్ దినోత్సవం



గురుకులంలో విజ్ఞాన ప్రదర్శనలు

నాయుడుపేటటౌన్: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు గురువారంతో ఘనంగా ముగిశాయి. పుదూరు అంబేద్కర్ బాలికల గురుకులం వద్ద జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మూడు రోజులపాటు నిర్వహించారు. క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి ప్రతిభకనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ పద్మజ, వైస్ ప్రిన్సిపల్ తస్నీరు శశికళ, ఉపాధ్యాయులు శైలజ, ప్రమీల, నాగభూషణమ్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రముని

సూళ్లూరుపేట: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటులు చేపట్టాలని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని అధికారులను ఆదేశించారు. ఈ నెల 13 జరగబోయే ఎన్నికలకు సంబంధించి వాడే బ్యాలెట్ బాక్సులను ఆయన గురువారం పరిశీలించారు. ఎన్ని బ్యాలెట్ బాక్సులు కావాలో సిద్ధం చేసుకుని, అవసరమైతే తెప్పించుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కే రవికుమార్ పాల్గొన్నారు.

ఎర్రస్మగ్లర్‌కు రిమాండ్

తిరుపతి లీగల్ : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడుగా ఉన్న తమిళనాడు విల్లుపురం జిల్లా శంకరాపురం తాలూకా కార్యలూరుకు చెందిన ఆర్.పళణివేలుకు ఈనెల 16వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నాగరాజు గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2018లో నిందితుడు పళణివేలుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎర్రచందనం అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. ఆ కేసులో అతను బెయిల్‌పై విడుదలై తిరిగి కోర్టు వాయిదాలకు హాజరుకాలేదు. దీంతో కోర్టు అతన్ని నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌పై హాజరుపరచాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆదేశించారు. అయితే ఇంతలో నిందితుడు పళణి వారెంట్‌ను రీకాల్ చేయాలంటూ తన న్యాయవాది ద్వారా కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తి రీకాల్ పిటీషన్‌ను కొట్టివేసి అతన్ని రిమాండ్‌కు తరలిస్తూ ఆదేశాలు జారీచేశారు.

నిందితుడి అరెస్ట్

ఓజిలి: ఓజిలి గ్రామంలోని ఆర్ఆర్‌హెచ్‌పీ గ్యాస్ గోదాముపై సోమవారం రాత్రి కొంతమంది వ్యక్తులు దాడి చేసిన సంఘటన విధితమే. ఈ దాడి కేసులో ప్రధాన నిందితుడైన ఫ్రాంక్లిన్‌ను గురువారం అరెస్టు చేసి నాయుడుపేట జడ్జి ఎదుట హాజరుపరిచినట్లు నాయుడుపేట రూరల్ సీఐ సోమయ్య తెలిపారు. దాడి కేసులో ఎనిమిది మందిని ఇదివరకే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

సీఎంతో చెవిరెడ్డి



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నేపథ్యంలో గురువారం విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

రుయాలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు సురేష్‌బాబు

తిరుపతి తుడా: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రుయా ఆస్పత్రిలో గురువారం మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు చేపట్టారు. ఏపీ ఎన్‌జీఓ తిరుపతి శాఖ అధ్యక్షుడు సురేష్‌బాబు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఇందులో ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా, నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 8న నిర్వహించనున్న మహిళా దినోత్సవంలో బహుమతులు అందజేస్తామన్నారు. రుయా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రోజమ్మ, ఉద్యోగ సంఘాల నేతలు భువనేశ్వరి, అరుణమ్మ, బాలాజీ, గిరిబాబు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రఘు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

దళారికి రిమాండ్

తిరుపతి లీగల్ : శ్రీవారి దర్శన టికెట్లు ఇస్తామంటూ భక్తుల వద్ద సొమ్ము తీసుకుని మోసం చేసిన కేసులో తెలంగాణా సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమైపల్లికి చెందిన ఎం.శ్రీకాంత్‌రెడ్డికి ఈనెల 16వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. నిందితుడు శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడి వద్ద శ్రీవారి రూ.300 దర్శన టిక్కెట్ల కొనుగోలుకుగాను రూ.10వేలను గూగుల్‌పే ద్వారా తీసుకున్నాడు. వారికి దర్శన టికెట్లు ఇవ్వకపోవడంతో ఆ భక్తుడు టీటీడీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విజిలెన్స్ అధికారి పద్మనాభన్ శ్రీకాంత్‌రెడ్డిపై తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి అతన్ని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

ఇంటర్ బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామానికి చెందిన ఇంటర్మీడియెట్(18) చదువుతున్న బాలిక గత నెల 24 నుంచి కనబడడం లేదని ఆమె తల్లి చెంబేటి రంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన బాలిక నాయుడుపేటలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బాలిక గత ఐదు రోజులుగా కనబడడం లేదని, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈమేరకు స్థానిక ఎస్ఐ కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు గొలుసు అప్పగింత



భక్తులకు బంగారు గొలుసును అందిస్తున్న టీటీడీ ఓఎస్డీ, సూపరింటెండెంట్

తిరుమల: భక్తురాలు వసతి గదిలో పోగొట్టుకున్న రూ.2 లక్షల విలువైన బంగారు గొలుసును టీటీడీ అధికారులు వారికి అప్పగించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. టీటీడీ ఓఎస్డీ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, నిజాంపేటకు చెందిన పీవీఆర్కే ఆంజనేయరాజు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం తిరుమలకు చేరుకున్నాడు. ఎంబీసీ పరిధిలోని విష్ణుపాదంలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం గదిని ఖాళీ చేసి వెళ్లిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన పారిశుద్ధ్య సిబ్బంది అక్కడ బంగారు గొలుసును గుర్తించి ఎంబీసీ సూపరింటెండెంట్ దయాకర్‌కు అందించారు. వెంటనే ఆయన భక్తులను ఫోన్ ద్వారా సంప్రదించగా వారు ఆభరణం గుర్తులను తెలిపారు. అనంతరం ఎంబీసీ విచారణ కార్యాలయంలో టీటీడీ ఓఎస్డీ సూపరింటెండెంట్ బంగారు గొలుసును భక్తులకు అప్పగించారు.

మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన



ప్రదర్శనలో మహిళా వర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : మహిళా యూనివర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వర్సిటీలో వారోత్సవాలు చేపట్టారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసర్ అనూరాధ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల ద్వారా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించవచ్చన్నారు. విద్యార్థుల్లో సైతం వ్యాపార నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. మహిళా అధ్యయన కేంద్రం ఇన్‌చార్జ్ హెడ్ నీరజ మాట్లాడుతూ ప్రదర్శనలో చేనేత, కళంకారీ, పట్టు వస్త్రాలు, గృహోపకరణాలు, జ్యూట్ బ్యాగ్స్, ఆర్గానిక్ ఫుడ్స్ తదితర ఉత్పత్తులు ఉన్నట్లు తెలిపారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న దిశా పోలీసులు

తిరుచానూరు(చంద్రగిరి): బాలికలు, మహిళలను ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుచానూరు దిశా టీం హెడ్ కానిస్టేబుల్ సుశీల, సునీత, నీరజ తెలిపారు. ముండ్లపూడి, పాడిపేట ప్రాంతాల్లో కొంతమంది పోకిరీలు స్కూల్ బస్సులు ఆగే ప్రదేశంలో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో దిశా పోలీసులు గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కాలేజీ, పాఠశాలల బస్సులు నిలిపే ప్రదేశంలో ఎవరైనా పోకిరీలు విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వారిని పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం తమ ఫోన్ నంబర్లను గ్రామస్తులు, యువతులకు అందజేశారు.